క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



పీసీసీ సభ్యుడికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో కొలువుదీరిన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ గ్రామ నాయకులు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నామని, తప్పకుండా హాజరై స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షులు నీరటి జగదీష్, కమ్మరి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి కడల భాస్కర్, ఐతబాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్‌పై ప్రత్యేక దృష్టి



శ్రీరాం కాలనీలో ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో గురువారం రాత్రి 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. గత కొన్నిరోజులుగా కాలనీలో దోమలు విజృంభిస్తూ స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న విషయమై కౌన్సిలర్.. కమిషనర్ వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ ఆదేశానుసారం శానిటేషన్ సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ నేతృత్వంలో వార్డు పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, నీరు నిల్వకుండా చూసుకోవాలని కమిషనర్ సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి

కందుకూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డబ్ల్యూఓడబ్ల్యూ సంస్థ ప్రచారకర్త రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నేదునూరు పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై ఆ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్, చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడం పర్యావరణానికి ఎంతో హానికరమన్నారు. భూమిలో ప్లాస్టిక్ కరగకుండా అలాగే ఉండటంతో భూమి వేడెక్కి అకాల వర్షాలు, భూకంపాలు వంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మా సంస్థ ఇళ్ల వద్ద, పాఠశాలలో వాడి పడేసే వ్యర్థాలను సేకరించి, రీసైక్లింగ్ చేసి కొత్త వస్తువులు తయారు చేయడానికి కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తమకు అప్పగిస్తే వారికి అవసరమైన పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు వంటివి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు వెంకటేశం, గ్లోరీ, కరుణాకర్, అబ్దుల్లా, డాక్టర్ ఎండీ. బషీర్, సిబ్బంది హోసుద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడ్తాల్: వేసవి కాలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ కోరారు. గురువారం మండల విద్యాధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కులగణన సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు టార్గెట్ అంటూ ఒత్తిడి తీసుకురావద్దని పేర్కొన్నారు. ఇందులో సంఘం మండల శాఖ అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు మల్లయ్య, విజయ్‌కుమార్, నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలి
- విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి
- మండల విద్యాధికారి నర్సింహ



పరీక్షకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు

కందుకూరు: విద్యార్థులు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలు వినియోగించుకొని శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాధికారి నర్సింహ సూచించారు. టీఎస్‌యూటీఎఫ్, జేవీవీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని నోబుల్ హైస్కూల్‌లో చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 20 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులను అభినందించారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. గ్రామస్థాయిలో నవంబర్ 7న నిర్వహించగా, నేడు మండలస్థాయిలో జరుపుతున్నామన్నారు. జిల్లాస్థాయిలో ఈ నెల 28న పరీక్ష నిర్వహించనున్నామన్నారు. అనంతరం నిర్వహించిన పరీక్షలో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలను ప్రకటించారు.

విజేతలు వీరే..

చెకుముకి పరీక్షలో ఇంగ్లీషు మీడియం నుంచి తిమ్మాపూర్ జెడ్పీహెచ్ విద్యార్థులు వి.అభిరామ్, కె.చరణ్, కె.నవ్యశ్రీ, తెలుగు మీడియం నుంచి పులిమామిడి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు టి.శ్రీచందన, కె.దీక్షిత, ఆర్.సంజన, మోడల్ స్కూల్ నుంచి ఎస్.విఘ్నేష్, బి.ప్రభాస్, వి.హర్ష, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల నుంచి నోబుల్ హైస్కూల్ విద్యార్థులు ఈ.ధనుష్, సీహెచ్ శ్రీకాంత్, డి.జగదీశ్ జిల్లాస్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజయ్య, బాలికల హెచ్‌ఎం కవిత, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రాములు, నోబుల్ హైస్కూల్ కరెస్పాండెంట్ బి.కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ కార్యాలయం వద్ద వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని తీసుకురండి
- రైతులకు అధికారుల సూచన
- కొనుగోలు కేంద్రం పరిశీలన

కందుకూరు: వరి ధానాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి. మద్దతు ధర పొందాలని కో–ఆపరేటివ్ శాఖ శంషాబాద్ సర్కిల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.మాధవరెడ్డి, కొనుగోలు కేంద్రాల మానిటరింగ్ అధికారి యు.రమేశ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం సేకరించారని సీఈఓ యాదగిరిరెడ్డిని అడిగారు. 9 మంది రైతుల నుంచి 580 బస్తాలను సేకరించినట్లు ఆయన వారికి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన నాణ్యతా ప్రమాణాలతో వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2320తో పాటు బోనస్‌గా రూ.500 అందిస్తున్నామని, సాధారణ రకం రూ.2300 చొప్పున సేకరిస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు శానిటరీ న్యాప్‌కిన్ కిట్లు అందజేస్తున్న అధికారులు

- పిల్లల బరువు, ఎత్తును నమోదు చేయాలి
- ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందజేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి బాలామృతం, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు సకాలంలో గుడ్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయాలని, రికార్డు ఆధారంగా పోషకాలు అందించాలని ఆదేశించారు. కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు అగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని చెప్పారు. అంతకు ముందు జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్లకు శానిటరీ న్యాప్‌కిన్స్ కిట్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



తుక్కుగూడ: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వాణి



మహేశ్వరం: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- డిసెంబర్ 4 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య పనులు
- ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధులు
- స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలు, పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మూత్రశాలలను ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్‌తో రోజు శుభ్రం చేసి, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అంతకు ముందు ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయించి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కారోబార్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా..

తుక్కుగూడ: తుక్కుగూడను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్‌ను ఆమె కమిషనర్ వాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, ఆరోగ్య కేంద్రాల్లో డిసెంబర్ 4వరకు పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. ఇందులో భాగంగా వీధులు, రోడ్ల వెంబడి చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులు చేపడతామన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- కలెక్టరేట్‌లో నాయకుల వినతి
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ డిమాండ్



బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని కోరారు. 5శాతం జనాభా లేనివారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటా కేటాయించాలన్నారు. బీసీ కులవృత్తుల ఆధునీకరణకు, ఇతర రంగాల్లో బీసీలకు ఆర్థిక ఎదుగుదలకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నరేందర్, సదానందం గౌడ్, నర్సింహ, యాదయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, విజయానందం గౌడ్, శ్రీను, రామకృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం సాధించడమే లక్ష్యం

తలకొండపల్లి: 'గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా సాధించడమే లక్ష్యం. అప్పటి వరకు పోరాటం ఆపేది లేదు' అని జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన దీక్ష గురువారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో మండల కేంద్రానికి కావాల్సిన వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. మండలం ఏర్పాటే ధ్యేయంగా సుదీర్ఘకాలం నుంచి గ్రామస్తులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి, గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, శ్యామల కుమార్, శివయ్య, శ్రీను నాయక్, రవి, బాలయ్య, జంగయ్య, మల్లయ్య, వెంకటయ్య, రాజు, కృష్ణయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కులగణన

తలకొండపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. గురువారం మండల పరిధి వెంకట్రావ్‌పేట్, చంద్రధన, జూలపల్లి, తలకొండపల్లి, రాంపూర్, జంగారెడ్డి పల్లి, చుక్కాపూర్, ఖానాపూర్ తదితర గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి, ప్రజల వివరాలు సేకరించారు. మండలంలో 14,385 ఇళ్లకు.. ఇప్పటి వరకు 12,432 ఇళ్ల సర్వేను చేసినట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

తుర్కయంజాల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం రాగన్నగూడ గణేశ్, శ్రీనివాస రంగాపురం కాలనీలో ఆయన సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి దుకాణ సముదాయం ఎదుట కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు ఉదయశ్రీ. మంగమ్మ, ఐలయ్య, ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలి

మండల విద్యాధికారి చాంప్లా నాయక్



విద్యార్థులకు బహుతులు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: సాంకేతిక పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ఎంఈఓ చాంప్లా నాయక్ సూచించారు. శాస్త్రీయ విజ్ఞానం మానవ జీవితంతో ముడిపడి ఉందని తెలిపారు. మండల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ దృక్పథంలో వ్యవస్థలు, వ్యక్తులు నడుచుకోవాలని సూచించారు. టాలెంట్ టెస్టులో ఆంగ్ల మాధ్యమం విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ గట్టుఇప్పలపల్లి విద్యార్థులు అనూష, అరుణ్ కుమార్, రామ్ చరణ్, తెలుగులో తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నారులు ప్రసాద్, వినయ్, నందిని, ఆశ్రమ పాఠశాల విభాగంలో కేజీబీవీ తలకొండపల్లి బాలికలు బిందు, షేర్వాని, అక్షితలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రాములు, ఉపాధ్యాయులు అరవింద్, శ్రీనివాసులు, రాధ, వెంకట్ పవర్, విజయ, శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చి నిర్వాహకులపై చర్యలు తీసుకోండి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ఎలాంటి అనుమతి లేకుండా చర్చిని నిర్వహించడమే కాకుండా.. మత మార్పిడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కడ్తాల్ జీపీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రం అంబేడ్కర్ కాలనీలో కొందరు చర్చిని కొనసాగిస్తున్నారని తెలిపారు. డీజేలతో కాలనీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇతర మతాలకు చెందిన దేవుళ్లను కించపరిచే విధంగా మాయ మాటలు చెబుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఎంచుకుని మతమార్పిడులకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్చి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, నాయకులు రవీందర్ రెడ్డి, మహేశ్, కుమార్, శ్రీను, జగన్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

మండల విద్యాధికారి హీర్యానాయక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ తదితరులు

ఇబ్రహీంపట్నం: మానవ అక్రమ రవాణా నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిదని మండల విద్యాధికారి హీర్యానాయక్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ స్కూల్ సమావేశపు హాల్‌లో శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వల చేసి ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని, ఇది యువతుల జీవితాలను చీకటిమయం చేస్తున్న నేరపూరితమైన చర్య అని అభివర్ణించారు. ముఖ్యంగా బాలికలు ఎక్కువగా మోసపోతున్నారని పేర్కొన్నారు. అక్రమ రవాణాపై తల్లితండ్రులు చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వరూధిని, ప్రజ్వల స్టేట్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం



యాచారం: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



మంచాల: నోములలో..

- ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- ముదిరాజ్ సంఘం నాయకులు
- ఘనంగా ముదిరాజ్ మహాసభ ఆవిర్భావం

మంచాల: హక్కుల సాధన కోసం పోరాడదామని ముదిరాజ్ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కోశాధికారి చింతకింది చక్రపాణి అన్నారు. ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధి నోముల గ్రామంలో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.సంఘం నాయకులు గంట విజయ్‌కుమార్, యాదగిరి, జంగయ్య, మహేందర్, దర్శన్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేలో ముదిరాజ్‌ల జనాభా ఎంతో ఉందో స్పష్టం చేయాలని సంఘం నాయకులు కోరారు. ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధి పలు గ్రామాల్లో సంఘం మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కానమోని గణేశ్, మహేందర్, సామ రాములు, నూకం మహేందర్, నరేష్, యాదయ్య, నర్సింహ, పాండు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పుర వీధుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ జయ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి అన్ని వీధుల్లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయ అన్నారు. మున్సిపల్ పరిధి 4వ వార్డులోని పలు వీధుల్లో స్థానిక వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్య ఆధ్వర్యంలో రూ.28 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పైపులైన్, సీసీరోడ్డు పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ శివానంద్, ఏఈ సుమంత్, కాలనీవాసులు సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చందులాల్, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాంరెడ్డి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.